

## ముఖరా(కే) పంచాయతీకి కేంద్ర పురస్కారం

జీపీకి అందనున్న రూ.50 లక్షల నిధులు


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం । 12 ఫిబ్రవరి 2026 । ■ 11 పేజీలు




## పోటెత్తిన పురజనం

# పోలింగ్ ప్రశాంతం





ఈ చైతన్యం ఆదర్శనీయం

ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- ■ ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ ■ బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం
- ■ ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 69.04 శాతం నమోదు ■ గతంతో పోల్చితే స్వల్పంగా తగ్గుదల
- ■ ఉత్సాహంగా ఓటు వేసిన యువత ■ పోలీసుల భారీ బందోబస్తు ■ చెదురుమదురు ఘటనల మధ్య ముగింపు
- ■ మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకి..? ■ మంచిర్యాల కార్పొరేషన్ సహా మూడు మున్సిపాలిటీలలో ముందంజ
- ■ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ ■ ఆదిలాబాద్‌లో బీజేపీకి మెజారిటీ సీట్లు ■ రేపు వెలువడనున్న ఫలితాలు









ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం 7గంటల నుంచే ఓటర్లు బారులు తీరినప్పటికీ, గతం కంటే ఓటింగ్ శాతం తగ్గింది. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ముఖ్యంగా మహిళలు, యువ ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషించారు. కాగా, అభ్యర్థులు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. వివిధ వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా గట్టి పోటీ ఇవ్వడంతో ఫలితాలు ఎటు తిరుగుతాయోనన్న ఆందోళన అభ్యర్థుల్లో కనిపిస్తోంది. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించిన అధికారులు, కౌంటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలో 11 మున్సిపాలిటీలు ఉండగా దాదాపు అన్నింటిలో 60శాతం నుంచి 80శాతంలోపు మాత్రమే పోలింగ్ నమోదైంది.

## అమ్మో భల్లూకం

- ■ ఆరుగురిపై దాడి.. ముగ్గురు మృతి
- ■ మహారాష్ట్ర సరిహద్దులో ఘటన
- ■ బోథ్ అటవీ ప్రాంతంలో ఎగులుబంటి సంచారం..
- ■ కదలికలపై అటవీశాఖ నిఘా
- ■ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ■ అడవుల్లోకి వెళ్లడంపై నిషేధాజ్ఞలు



6

### ముంచుతారా?

## గట్టెక్కిస్తారా?

- ■ లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- ■ సామాజిక వర్గాల ఓట్ల వివరాల సేకరణ
- ■ కాకిలెక్కలతో గెలుపుపై ధీమా




### సింగరేణి సీఎండీగా

## జ్యోతి బుద్ధప్రకాశ్

సింగరేణి సంస్థ సీఎండీగా సీనియర్ ఐఏఎస్ జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న కృష్ణభాస్కర్‌ను రిలీవ్ చేసింది.



# పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలిన ఓటర్లు



## పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో పోలింగ్ సందడి మొదలైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. ఆయా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివెళ్లి ఓటు వేశారు. 68 పోలింగ్ కేంద్రాల్లో 8 గంటలలోపే పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు బారులు తీరు కనిపించారు. మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు తండోపతండాలుగా వెళ్లారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పర్యవేక్షించారు. ప్రశాంతంగా పోలింగ్ కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను పోలీసు ఉన్నత అధికారులు సమీక్షిస్తున్నారు.

## బెల్లంపల్లిలో దొంగ ఓట్ల కలకలం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మున్సిపాలిటీలో 29వ వార్డులో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దొంగ ఓట్లు వేస్తున్నారని బీజేపీ అభ్యర్థి రమేష్ ఆరోపించారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో 29వ వార్డులోని 57, 58 పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రాజులాల్ యాదవ్ ఇతర రాష్ట్రాల ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంగ ఓటర్లతో గెలుపొందే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ ఘర్షణ

**ముథోల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

డబ్బులు పంచుతున్నారంటూ ఆరోపిస్తూ తమపై, తమ సంబంధీకులపై దాడికి దిగారంటూ... పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి కే.మాధవి భర్త కె.అరవింద్ ఆరోపించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కి సంబంధించి అభ్యర్థి తరుపున ఏజెంట్ల ఫారాలను నింపే క్రమంలో ఏజెంట్లను కలిసేందుకు వెళ్లానన్నారు. ఈ క్రమంలోనే డబ్బులు పంచుతున్నారంటూ తొమ్మిదో వార్డుకి చెందిన మరో అభ్యర్థి తాలోడ్ రాధిక భర్త తాలోడ్ శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సీసీ కెమెరాల్లో



దాడికి సంబంధించిన ఫుటేజ్లు రికార్డు అయ్యాయని, వాటిని పోలీసులకు అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎన్నికల నిబంధనలకు తూట్లు పరిచే కార్యక్రమాలకు తలపడితే, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలే తప్ప, దాడికి పాల్పడడం తప్పని బాధితుడు వాపోయారు.




## ఓటర్లకు మొక్కల పంపిణీ

**ముథోల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

బైంసా పట్టణంలోని కిసాన్ గల్లీకి చెందిన మోడల్ పోలింగ్ కేంద్రాలు 41, 42లలో అధికారుల ఆదేశాల మేరకు మొదట ఓటు హక్కును వినియోగించుకున్న వందమందికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 41, 42 పోలింగ్ కేంద్రాల రిటర్నింగ్ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ స్టేట్ ఎలక్షన్ అధికారుల ఆదేశాల మేరకు మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టామని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. అయితే బైంసాలో ప్రశాంతంగా పోలింగ్ నమోదు ప్రక్రియ సాగగా వృద్ధులు సైతం ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అధికారులు సైతం ప్రత్యేక అవసరాలు గల ఓటర్లని గమనించి సంబంధిత ఏర్పాట్లు చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే దంపతులు

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు- శివాని, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ నితికా పంత్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్
- పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు అపమత్తంగా ఉండాలని ఎస్పీ నితికాపంత్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని 30 వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ నితికా పంత్ పర్యవేక్షించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన బందోబస్తు కొనసాగుతుందని, ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందకుండా ఓటు వేయాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా బందోబస్తు విషయంలో డీఎస్పీతో అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారితో వివిధ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వహీదోద్దీన్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

## వివాహిత బలవన్మరణం

**మందమర్రి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

మందమర్రి పట్టణం శ్రీపతినగర్‌కు చెందిన పొన్నం శ్రావణి గడ్డిమందు తాగి బలవన్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే శ్రావణికి మూడు నెలల క్రితం గజ్జెలి రంజిత్‌తో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన శ్రావణి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉండేది. భర్త రంజిత్ మంచిర్యాలలోని చైతన్య స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేస్తూ, హైదరాబాద్‌కు బదిలీ అయితే ఇద్దరం కలిసి ఉండవచ్చని అనుకునే సమయంలో మంగళవారం శ్రావణి గడ్డిమందు తాగింది. వార్డెన్, సిబ్బంది రంజిత్‌కు ఫోన్ చేసి శ్రావణి మందు తాగిన విషయం తెలియజేయడంతో కంగుతిన్న రంజిత్ హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అడ్మిట్ చేశాడు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచింది. ఇటీవల పెళ్లి చేసుకున్న నూతన జంటలో విషాదం నెలకొనడంతో అటు రంజిత్ కుటుంబ సభ్యులు, ఇటు శ్రావణి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం పార్థివ దేహాన్ని మందమర్రిలోని స్వస్థలానికి తీసుకువచ్చారు. ఈ విషాద ఘటన ఎలా జరిగిందన్న పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**వాంకిడి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బంబార గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా గ్రామంలోని మూడో అవార్డులో పెరుక్కుపోయిన పిచ్చి మొక్కల తొలగింపు మరియు మురుగు కాలువ పూడికతీత పనులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బెండారే కృష్ణాజీ, ఉప సర్పంచ్ జాడే సంతోష్, గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మయ్యలు హాజరై పనులను స్వయంగా పర్యవేక్షించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామమంతా పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. రహదారులకు ఇరువైపులా ఉన్న పొదలును తొలగించడం ద్వారా దోమల నివారణతో పాటు ప్రజలకు రాకపోకలకు



ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుం టున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి ధర్మయ్య మాట్లాడుతూ... పారిశుధ్య నిర్వహణలో రాజీ పడకుండా పనులు కొనసాగిస్తున్నామని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పాల్గొని పారిశుద్ధ పనులను వేగవంతం చేశారు.

## అరటిపళ్లతో ప్రలోభం.. ఆటో డ్రైవర్‌పై కేసు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

మహాలక్ష్మి వాడలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అరటిపళ్లు పంచుతున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ అర్షద్‌పై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు అతని ఆటోను సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.



## మహిళ వద్ద కత్తి లభ్యం

### పోలింగ్ బూత్ వద్ద కలకలం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్‌లోని 11వ వార్డు పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి భర్తతో కలిసి వచ్చిన ఓ మహిళ వద్ద కత్తి లభ్యం కావడం కలకలం రేపింది. పోలింగ్ కేంద్రంలో ఓటేయడానికి వరసలో వస్తున్న పర్వీన్ అనే మహిళను అక్కడున్న మహిళా పోలీసులు తనిఖీ చేశారు. ఆమె వద్ద కత్తిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను మావల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళతోపాటు ఆమె భర్తపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి వివిధ రకాల వస్తువులు తీసుకురావద్దని ముందుగానే సూచించినా బుధవారం ఓటు వేయడానికి వచ్చిన మహిళ కత్తితో రావడం పోలింగ్ కేంద్రం వద్ద కలకలం రేపింది.






# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్

## పోలీసు సిబ్బంది పలు సూచనలు - విజయోత్సవ ర్యాలీలకు అనుతిలేదు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపీఎస్ పలు కేంద్రాలను పరిశీలించి సిబ్బంది బందోబస్తు మరియు ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తవడం జరుగుతుంది. ప్రజల నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొవడం జరిగింది. ఎన్నికలు జరిగిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలిం చారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, సమస్యాత్మక ప్రాంతాలలో స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన అక్కడి పరిస్థితులను, భద్రతా బందోబస్తును, పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ.. సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణనే ప్రాధాన్యంగా తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవచ్చన్నారు.

---

### తాండూర్‌కు చేరిన
## సుబ్రత్ మహారాణా సైకిల్ యాత్ర

**తాండూర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
సనాతన ధర్మ పరిరక్షణ, విస్తరణ, జాతీయ సమైక్యతను పెంపొందించే లక్ష్యంతో ఓ యువకుడు దేశవ్యాప్తంగా సాహసోపేతమైన సైకిల్ యాత్ర చేపట్టాడు. ఒడిశా రాష్ట్రం నుంచి సైకిల్ యాత్ర చేపట్టిన యువకుడు సుబ్రత్ మహారాణా యాత్ర బుధవారం తాండూర్ చేరింది. ఒడిషా రాష్ట్రంలోని ఝార్సుగూడ జిల్లా, బెల్బిహార్ జురా గ్రామానికి చెందిన ఈ యువకుడు.. స్వగ్రామం నుంచి పది రోజుల కిందట ఈ ప్రయాణాన్ని ప్రారంభించారు. తన తండ్రి పద్మనాభ మహారాణా ఆశయాలకు అనుగుణంగా, తల్లి సుకాంతి మహారాణా అందిస్తున్న ప్రోత్సాహంతో ఈ యాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గతంలోనూ ఆయన గోమాత పరిరక్షణ కోసం 8 రాష్ట్రాల్లో సైకిల్ పై పర్యటించి.. గోవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం దేశంలో ప్రాంతాలు, కుల మతాల మధ్య భేదాలను తొలగించి, 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సందేశాన్ని వ్యాప్తి చేయడం, మట్టిని రక్షించడం, చెట్లను నాటడం వంటి పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించడం, సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యాన్ని, దేశవ్యాప్త యాత్ర ద్వారా దేశభక్తిని పెంపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పలు ప్రముఖ ఆలయాలను సందర్శించనున్నట్లు తెలిపారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, శ్రీశైలం, తిరుపతి, అరుణాచలం, రామేశ్వరం వరకు ప్రయాణించి అక్కడి నుంచి ఉత్తర భారతదేశంలోని చార్ధామ్ పుణ్యక్షేత్రాలు దర్శించుకోవడంతో యాత్ర ముగుస్తుందని వివరించారు.



---

# వాట్సాప్ స్టేటస్‌లో ఓటు వేసిన బ్యాలెట్ పేపర్

### 19 వార్డు మాజీ కౌన్సిలర్ నిర్వాకం
### బ్యాలెట్ పేపర్ స్టేటస్ కలకలం
### ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఓ మాజీ కౌన్సిలర్ ఓటు వేసి బ్యాలెట్ పేపర్‌ను స్టేటస్‌లో పెట్టుకున్న సంఘటన వెలుగు చూసింది. పట్టణంలోని బెల్లంపల్లి బస్తీలోని 19 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొమ్ముల జయ, తనయుడు మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ 32 పోలింగ్ బూత్ లో ఓటు ఓటు వేశారు. ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ ను ఫోటో తీసుకొని స్టేటస్ పెట్టుకున్న సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ స్టేటస్ తెర పైకి రావడంతో ఎన్నికల అధికారులు ఒక్క సారిగా ఖంగుతిన్నారు. పోలింగ్ బూత్‌లోకి ఆయన సెల్‌ఫోన్‌తో ఎలా వెళ్లడని చర్చ జరుగుతుంది. పోలింగ్ బూత్ అధికారులు, పోలీసుల తనిఖీల వైఫల్యం వల్లనే ఈ సంఘటన చోటుచేసుకుందని తెలుస్తోంది. ఈ ఘటనపై ఎన్నికల ఉన్నతాధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. అత్యుత్సాహంతో ఓ మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ నిర్వాకంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటు వేసిన బ్యాలెట్ పేపరు స్టేటస్ తో బయటికి రావడం, ఎన్నికల అధికారులు, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనే చర్చ ఆసక్తికరంగా మారింది.

---

# బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్‌ను ఈడ్చేసిన పోలీసులు

**మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యాలకు దిగుతోంది. మంచిర్యాల జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఏజెంట్‌లను లక్ష్యంగా చేసుకుని పోలీసులతో దౌర్జన్యం చేయిస్తోంది. బీఆర్ఎస్ ఏజెంట్‌లను పోలింగ్ బూత్‌ల లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటోంది. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ, 10వ పోలింగ్ కేంద్రాల దగ్గర బీఆర్ఎస్ ఏజెంట్‌గా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలింగ్ బూత్ లోపలికి వెళ్లకుం పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడంతో పోలింగ్ కేంద్రం ఆవరణ నుంచి పక్కకు



ఈడ్చుకెళ్లారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఆయన పోలింగ్ కేంద్రం ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు.

---

### వాట్సాప్‌లో మతం పేరుతో
# ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

### మతాన్ని అడ్డుకు పెట్టుకుని ఓటును ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నం
### ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు - వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మతాన్ని అడ్డుగా పెట్టుకుని ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వాట్సాప్‌లో వివాదాస్పద ప్రచారం చేస్తున్న వ్యక్తిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చంద్రశేఖర్ ఏ చందు అనే వ్యక్తి "హుండీలలో విరాళాలు వేయడం వల్ల హిందూ మతం రక్షించబడదు, బ్యాలెట్ బాక్స్ నందు హిందువు ఓటు వేయడం ద్వారా రక్షించబడుతుంది" అనే సందేశాన్ని వాట్సాప్‌లో ప్రసారం చేస్తూ మతం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మతం, కులం పేరుతో ఓటర్లను ప్రలోభపెట్టడం లేదా రెచ్చగొట్టే ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

---

### పోలింగ్ రోజూ
# మంత్రి వివేక్ ప్రచారం

### ఎన్నికల సంఘం తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**చెన్నూర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
రాజ్యాంగ విలువను, ఎన్నికల విధానాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ తుంగలో తొక్కారు. పోలింగ్ జరుగుతున్న రోజున(బుధవారం)సైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీలో మంత్రి ప్రచారం చేశారనే విమర్శలు వస్తున్నాయి. చెన్నూర్ వాడాలో 4, 5 బూత్‌లలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి బైక్ పై తిరుగుతూ ప్రచారం చేశారు. దాదాపు మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బైక్‌పై తిరుగుతూ ప్రచారం చేస్తూ కెమెరా కంట పడ్డారు. ఇందుకు సంబంధించి న ఫోటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిన్న సైతం ఇదే తరహాలో క్యాతన్ పల్లి, చెన్నూరు మున్సిపాలిటీల్లో తిరుగుతా మంత్రి ప్రచారం చేశారు. దీంతో రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ అంటే గౌరవం లేదా.. విచ్చల విడిగా ఇలా అధికార దుర్వినియోగం చేయడం ఏంటి.. మంత్రి స్థాయి వ్యక్తి ఇలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత జరుగుతున్న అడ్డుకోవాల్సిన ఎన్నికల సంఘం, అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## ఆరుగురిపై దాడి.. ముగ్గురు మృతి

**బోథ్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సరిహద్దులోని మహారాష్ట్ర కైలాస్ టేకిడిలో ఎలుగుబంటి ఆరుగురిపై దాడి చేసింది. ఈ ఎలుగుబంటి దాడిలో ముగ్గురు మృతి చెందారు. మరొక ముగ్గురికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఎలుగుబంటి చంపిన వ్యక్తి శవంపై కూర్చున్న దృశ్యాలు వణుకు పుట్టించాయి. దాడికి గురైన వ్యక్తిని అధికారులు జేసీబీతో బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అటవీ అధికారులు బోథ్ సరిహద్దులో హెచ్చరిక జారీ చేశారు. ఉపాధి పనికి వెళ్లవద్దని, అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని ప్రజలను అటవీ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. బోథ్ ప్రాంత అడవులలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్టుగా అటవీ క్షేత్ర అధికారిటి ప్రణయ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రాత్రి మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో మహారాష్ట్రకు చెందిన పలువురిపై ఎలుగుబంటి దాడి చేసినట్టు వెల్లడించారు. దీంతో పలువురు తీవ్ర గాయాలైనట్లుగా అక్కడ అధికారులతో సమాచారం ఉన్నట్లుగా తెలిపారు. ముఖ్యంగా బోథ్ అటవీ ప్రాంతంలోకి ఆ ఎలుగుబంటి ప్రవేశించినట్టు సమాచారం. అడవికి సమీపాన ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడవిలోకి ఎవరు వెళ్ళవద్దని కోరారు.

# చంపి శవంపై కూర్చున్న ఎలుగుబంటి





### మున్సిపల్ కౌంటింగ్
## రోజు ట్రాఫిక్ ఆంక్షలు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో, ఈనెల 13వ తేదీన ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కాంటా చౌంస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసిఫాబాద్ వైపు వెళ్లే వాహనదారులు కొత్త బస్టాండ్ నుంచి కన్నాల ఫ్లైఓవర్ మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలని సూచించారు. అలాగే, మంచిర్యాల వైపు వెళ్లేవారు కాంటా చౌరస్తా నుంచి కాల్ టెక్స్ మీదుగా వెళ్లాలని సూచనలు జారీ చేశారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలంలోని జంగాం, పోచంలొడ్డి కేజీబీవీ పాఠశాలల్లో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణ, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు సాగర్, జెండర్ స్పెషలిస్ట్ రాణి పోస్టర్లు విడుదల చేసి బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికలపై వేధింపులకు పోక్సో చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# తానూర్-మొగిలి రహదారికి నిధులు మంజూరు

**ముథోల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

తానూర్ నుండి మొగిలి వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ముథోల్ మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సుమారు 3 లక్షల రూపాయల గ్రావెల్ నిధులు మంజూరు అయ్యాయి. గ్రామస్తులు రోడ్డు పనులను ఉత్సాహంగా ప్రారంభించారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి మొగిలి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**జన్నారం, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, గురువారం నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జన్నారం మండల సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి కొండగుర్ల లింగన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకునేలా కార్మిక వర్గం ప్రతిఘటనకు పూనుకోవాలని, లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మికులకు కర్షకులకు విజ్ఞప్తి చేశారు. సమ్మెతోనే పాలకవర్గానికి సమాధానం చెప్పాలని 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో రాష్ట్రంలో అన్ని స్థాయిలోని అన్ని కార్మిక సంఘాలు వాటి అనుబంధ యూనియన్లు యావత్ కార్మికులు భాగస్వామ్యం కావాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు కోరాయి. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు బుచ్చయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, మండల నాయకులు రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధురాలిపై అడవి పంది దాడి, తీవ్ర గాయాలు

**ఇచ్చోడ, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

సాల్యాద గ్రామంలో ఇస్రుబాయ్ చేనులో పనిచేస్తుండగా అడవి పంది దాడి చేసింది. ఈ దాడిలో ఆమె కుడి మోకాలు, కడుపుకు తీవ్ర గాయాలయ్యాయి. కడుపులోని పేగులు బయటకు రావడంతో ఆమె అరుపులు విని స్థానికులు స్పందించి, అడవి పంది నుంచి ఆమెను రక్షించారు. 108 అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



### ముసలమ్మ గుట్ట శివాలయం
## జాతర పోస్టర్ల ఆవిష్కరణ

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామంలోని ముసలమ్మ గుట్ట శివాలయం జాతర పోస్టర్లను బుధవారం ఎస్సై ఇస్లావత్ నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపడతామని, జాతరను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. జాతర ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### అటవీశాఖ అధికారులతో
## గ్రామస్తుల వాగ్వాదం

**లింగాపూర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

లింగాపూర్ మండలం జాముందర గ్రామపంచాయతీ పరిధిలోని మోతుగూడలో నీటి సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు బోర్‌వెల్ తవ్వకం చేపట్టగా, ఆ ప్రాంతం అటవీ భూమిగా నమోదై ఉందని అటవీశాఖ అధికారులు పనులను నిలిపివేశారు. ఫారెస్ట్ భూముల్లో అనుమతి లేకుండా బోర్‌వెల్ తవ్వకాలు చేయరాదని అధికారులు చెప్పడంతో, గ్రామంలో తీవ్ర నీటి కొరత ఉందని, తాగునీటి కోసం బోర్‌వెల్ అవసరమని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు గ్రామస్తులతో చర్చలు జరపాల్సి ఉంది.

## పోలింగ్ కేంద్రాల వద్ద నగదు పంపిణీ

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టేలా నగదు పంపిణీ చేస్తున్న ఇద్దరిపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసినట్లు వన్డే టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు. బోరాజ్ మండలం పిప్పర్వాడ గ్రామానికి చెందిన రాజా రెడ్డి, భుక్తాపూరికి చెందిన మేకల కృష్ణ కుమార్ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,140 స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు నగదు, బహుమతులు, ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయడం చట్టరీత్యా నేరమని సీఐ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయండి

**వాంకిడి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలను భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ గాదే ప్రవీణ్ కుమార్ కోరారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 14న గంగాజలాభిషేకం, 15న రథోత్సవం, 16న శివపార్వతుల కళ్యాణం జరగనున్నాయి. జాతరలో మహా అన్నదానం, ప్రతిరోజు సాయంత్రం గంగ హారతి ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు.





# నల్ల బ్యాడ్జీలతో మాజీ ఎమ్మెల్యే నిరసన

**చెన్నూర్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరులో స్థానిక మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నల్ల బ్యాడ్జీతో నిరసన చేపట్టారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, అధికారులు ఆయనకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకట స్వామి బైక్‌లపై పోలింగ్ బూత్‌ల వద్ద తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ తన తన కారులో 15 లక్షల రూపాయలను, మందు కాటన్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని ఆయన ఆరోపించారు. చెన్నూర్ మున్సిపాలిటీలో రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భర్త పెద్దింటి శ్రీనివాస్ ఓటర్లకు డబ్బులు బహిరంగంగా పంచుతున్న వీడియో బయటకు వచ్చిందని, దీన్నిబట్టి చూస్తుంటే ఎన్నికలు ఎంత దుర్మార్గంగా జరుగుతున్నాయో స్పష్టమవుతున్నాయని బాల్క సుమన్ అన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



### ఓటు హక్కు వినియోగించుకున్న
## ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
భైంసా పట్టణంలోని 20వ పోలింగ్ కేంద్రంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజలకు సేవ చేసే నాయకున్ని ఎన్నుకోవాలని ఆయన కోరారు. భైంసా మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### తండ్రికి ఓటు వేసేందుకు
## లండన్ నుంచి స్వదేశానికి..!

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని 6వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తండ్రి చిలువేరు వెంకన్న ఓటు వేసేందుకు కూతురు చిలువేరు శ్రేయ లండన్ నుంచి స్వదేశానికి వచ్చింది. ఆసిఫాబాద్ పట్టణంలోని జడ్పీ ఎస్ఎస్ ఉర్దూ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకుంది. ఇందుకోసం శ్రేయ నెల రోజుల ముందే టికెట్ సైతం బుక్ చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



## విద్యుదాఘాతంతో గేదె మృతి

**ముథోల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
పంట చేలల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తగిలి ఓ గేదె మృతి చెందింది. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన రైతు లక్కంపల్లి పురుషోత్తం రావ్ గేదె బుధవారం మేతకు వెళ్లగా, కేవలం మూడు అడుగుల ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ నుంచి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. చనిపోయిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదు కోవాలని రైతు కన్నీరుమున్నీరయ్యారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్ఫార్మర్లను ఎత్తులో ఏర్పాటు చేయాలని, బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని స్థానికులు కోరుతున్నారు.

# వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలు





**జన్నారం, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలోఘనంగా ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా జన్నారం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవంగా భావించే రేణుక ఎల్లమ్మతల్లి బోనాలు నేటితో ముగిశాయి. మంగళవారం రాత్రి మహిళలు ఇంటికొక బోనం చొప్పున నెత్తిన పెట్టుకుని బోనాలను తీసుకొని వెళ్లి ఎల్లమ్మకు సమర్పించారు. తమను సల్లంగా చూడు తల్లి అని బోనం సమర్పించుకున్నారు బుధవారం బైండ్ల కులస్తుల చేత పట్నాలు వేసి మేకపిల్లను గావు పట్టారు. ఐదు రోజులు జరుగుతున్న బోనాల పండుగకు గౌడ కులస్తులే కాకుండా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు బుధవారం ఆలయ సమీపంలోని తాటి చెట్టును 13 మంది గీతా కార్మికులకు ఎక్కి చెట్టు నుండి ఒకరి నుంచి ఒకరు కల్లు కుండా ను తీసి అమ్మవారికి సమర్పించారు 13 మంది గీత కార్మికులు ఒకేసారి చెట్టు ఎక్కి ఒకరి నుంచి మరొకరు కళ్ళు కిందకు దించడం చూసే వారిని అబ్రపరిచింది కార్యక్రమం అంతా కన్నుల పండగ నిర్వహించిన గౌడ కులస్తులకు అభినందనలు తెలిపారు.

# మూడు మున్సిపాలిటీల్లో విజయం మాదే



**నిర్మల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిర్మల్ భైంసా ఖానాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం వల్ల ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అప్పల కావ్య మాజీ చైర్మన్ గణేష్ చక్రవర్తి, మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాషాయం జెండా ఎగరవేస్తాం
### ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**నిర్మల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్లో ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపారని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అవినీతి రహిత పాలన ధర్మ రక్షణ కోసం ఓటర్లు బిజెపి వైపు మొగ్గు చూపడంతో మూడు మున్సిపాలిటీలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత
### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం 52వ డివిజన్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించినటువంటి ఓటు హక్కు సమాజంలో బాధ్యతగా వినియోగించుకొని మంచి పాలకులను ఎన్నుకోవాలన్నారు. భవిష్యత్తులో స్థానిక సమస్యలపై కార్పొరేషన్‌లో గల వ్యక్తి పరిష్కార మార్గాన్ని చూపే నాయకుని ఎన్నుకోవాలని ఆయన అన్నారు.



### కంట్రోల్ రూమ్‌లో మున్సిపల్ ఎన్నికల
## ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

**నిర్మల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

## దుప్పి మాంసం స్వాధీనం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని చాకపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజ్ కుమార్, దుర్గం వెంకటిల వద్ద దుప్పి మాంసం కూరను స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ తెలిపారు. చాకపల్లి గ్రామ శివారులో దుప్పిని వేటాడి చంపినట్లు పేర్కొన్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## మతం పేరుతో ప్రచారం వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసేలా వాట్సాప్ లో మతం పేరుతో ప్రచారం చేసిన చంద్రశేఖర్ పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 'హుండీలలో విరాళాలు వేయడం వల్ల హిందూ మతం రక్షించబడదు, బ్యాలెట్ బాక్స్ హిందువు ఓటు వేయడం ద్వారా రక్షించబడుతుంది' సందేశాన్ని ప్రచారం చేసినట్లు సీఐ తెలిపారు.

## వృద్ధ ఓటరుకు చేయూత

**నిర్మల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా, జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 2 నాయుడువాడలో నడవ లేని స్థితిలో ఉన్న వృద్ధ ఓటరుకు స్థానిక రిపోర్టర్ కృష్ణ వీల్‌చైర్ సహాయంతో పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించారు.

# ముంచుతారా? గట్టెక్కిస్తారా?

■ లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు ■ సామాజిక వర్గాల ఓట్ల వివరాల సేకరణ
■ కాకిలెక్కలతో గెలుపుపై ఎవరికి వారు ధీమా

ఆదిలాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో తలపడిన అభ్యర్థులు గెలవడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. తొక్కని గడపలేదు, మొక్కని దేవుళ్ళు లేరు. చివరకు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో కొందరు రూ.లక్షలు ఖర్చు చేస్తే.. మరికొందరు రూ.కోట్లు తగలేశారు. అంతా చేసినా ఓటర్లు తమను ముంచుతారా?.. తేల్చుతారా? అన్న టెన్షన్ వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. సొమ్ము పోయినా ఓడితే పరువు పోతుందనుకునే వారు కొందరైతే.. ఓడితే రాజకీయ జీవితం కైలాసపటంలో పెద్దపాము మింగినట్లుగా మరికొందరి భవిష్యత్తు పాతాళానికి పడిపోనుంది. దీంతో అభ్యర్థులు పోలింగ్ అయిన తరువాత ఏజెంట్ల ఓటరు లిస్ట్ ఆధారంగా పోల్ అయిన ఓటర్ల సామాజిక లెక్కలు తీస్తున్నారు. ఏయే సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎన్ని పోలయ్యాయి? అందులో తమకు అనుకూలంగా ఉన్నవి ఎన్ని? ప్రతికూలంగా ఉన్నవి ఎన్ని? అన్న వివరాలు సేకరిస్తున్నారు. ప్రాంతాల వారీగా పోలైన లెక్కలు కూడా తీస్తున్నారు. వాటి ఆధారంగా తమకు ఎన్ని ఓట్లు పోలయ్యే అవకాశం ఉంది?, ప్రత్యర్థికి ఎన్ని ఓట్లు రావచ్చు? అని అంచనా వేస్తున్నారు. గెలుపుధీమా ఉన్న మరికొందరు మాత్రం మెజారిటీ ఎంతొస్తుందన్న లెక్కలు తీస్తున్నారు. ఎవరికి వాళ్లు కాకి లెక్కలతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అనుచరులు కూడా నాయకులను మెప్పించేందుకు ఫలానా చోట మనకు ఇన్ని ఓట్లు వస్తున్నాయని, తక్కువ ఓటతోనైనా మనం గెలుస్తున్నామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్‌లకు చేరింది. అందులో ఏముందన్నది ఈనెల 13న తేలనుంది. సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ అంతకంతకు పెరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసే ముందే ఆయా వార్డుల వారీగా ప్రధాన పార్టీలు ఏయే వార్డుల్లో గెలుస్తున్నామనే అంచనాలు వేసుకోవడం జరిగింది.. గెలుస్తామని అనుకుంటున్న స్థానాలకు అక్కడ వచ్చే ఫలితాలు తోడవడం ద్వారా పీఠం కైవసంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురుకావా అనే సందేహాలు కూడా పార్టీల్లో లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి నుంచే క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి.






పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును

## వినియోగించుకున్న ఎస్పీ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 4వ వార్డ్‌కు సంబంధించిన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఓటు కీలకమని జిల్లా ఎస్పీ సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## యూరియా కోసం ఆందోళన వద్దు

దహెగాం, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, యాసంగి సాగుకు సరిపడా నిల్వలు ఉన్నాయని డీఏవో వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. యూరియా బుకింగ్ చేసుకున్న రైతులకు సకాలంలో అందించాలన్నారు. అలాగే భూమి ఉన్న ప్రతిఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, ఏఈవోలు సుష్మిత, ఆదిత్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్

కృష్ణభాస్కర్‌ను రిలీవ్ చేస్తు ఉత్తర్వులు
గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన బుద్ధప్రకాశ్



మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్‌లతో పాటు నాన్-కేడర్ అధికారుల బదిలీలతో పాటు పోస్టింగ్‌లు ఇచ్చింది. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా సీనియర్ ఐఏఎస్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను నియమించింది. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న కృష్ణభాస్కర్‌ను రిలీవ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న జ్యోతి బుద్ధప్రకాశ్‌ను బదిలీ చేసి, సింగరేణికి పూర్తి స్థాయి సీఎండీగా నియమించింది.

# ముఖరా(కే) పంచాయతీకి కేంద్ర పురస్కారం

జీపీకి అందనున్న రూ.50 లక్షల నిధులు



ఇచ్చోడ, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కె) గ్రామ పంచాయతీని మరో పురస్కారం వరించింది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ గ్రామ్ స్వరాజ్ మిషన్ (ఆర్జీఎస్ఏ) ద్వారా అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్న పంచాయతీలకు పుర స్కారాలను ప్రకటించింది. పేదరిక నిర్మూలన, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, ప్రజల ఆరోగ్యం మహిళ, శిశు అభివృద్ధి, తాగునీరు, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పన, సోషల్ సెక్యూరిటీ వంటి అంశాల్లో ప్రతిభ చాటిన పంచాయతీలకు ఈ పురస్కారాలను అందిస్తోంది. ఇందులో భాగంగానే 2023 సంవత్సరానికి గాను ముఖరా(కె)కు 'గ్రామ్ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ' పురస్కారాన్ని ప్రకటిస్తూ కేంద్ర పంచాయతీ రాజ్యాభ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక కేటగిరీలో ప్రక టించిన ఈ అవార్డు కింద ఆ గ్రామ పంచాయతీకి రూ.50 లక్షల నగదు పురస్కారం అందనుంది. కాగా ఈ పురస్కారం వరించడంపై పంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓటుకు దూరంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. ఎమ్మెల్యే వినోద్‌కు హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో ఓటు ఉండగా, మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యకు నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌లో ఓటు ఉంది. దీంతో మున్సిపల్ ఎన్నికలను ముందుండి నడిపించినప్పటికీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసే వీలు లేకుండా పోయింది. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇద్దరు ఓటుకు దూరంగా ఉండడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

## సేవాలాల్ జయంతికి తరలిరావాలి

కెరమెరి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

కెరమెరి మండల కేంద్రంలో ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతికి తరలిరావాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూపల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు సేవాలాల్ ప్రతిమ వద్ద జెండా ఆవిష్కరణ, నివాళి, భోగ్‌భండార్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 17న జిల్లా కేంద్రంలో సేవాలాల్ జయంతి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఉత్తం, శేషారావు, అంబాజీ, బల్వంత్, రాందాస్, శంకర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలను

## బలోపేతం చేయాలి

కెరమెరి, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని డీఆర్డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం సీసీ, వీవోఏలకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మొండి బకాయిల వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. తేనెటీగల ఉత్పత్తికి మహిళలు ముందుకురావాలని ఖమ్మం జిల్లాకు చెందిన ఆరో ఎన్జీవో ప్రతినిధి మధు సూచించారు. అయితే గతంలో ప్రారంభించిన ప్రాజెక్టు విజయవంతం కాలేదని, ప్రస్తుతం ముందుకురావడం కష్టమని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం నరేందర్, ఏపీఎం ముక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## టేకు చెట్లు నరికిన వ్యక్తి రిమాండ్

నేరడిగొండ, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

టేకు చెట్లు నరికిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిచెల్మ ఎస్ఆర్టీఓ నాగావత్ స్వామి తెలిపారు. అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఉట్నూర్ అటవీ మండల అధికారి అరవింద్ ఆదేశాల మేరకు బుధవారం సోదాలు నిర్వహించారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామానికి చెందిన కనక రమేష్ పట్టుబడడంతో 14 రోజుల పాటు రిమాండుకు తరలించినట్లు వివరించారు. లఖన్సింగ్, సచిన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు

## నగదు పంచుతుండగా పట్టివేత

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం రాత్రి ఓటర్లకు పంచుతుండగా నగదు పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారనే సమాచారం మేరకు వార్డులో గస్తీ నిర్వహించి కుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.61 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని నేడు బొగ్గు గనుల్లో సమ్మె

మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల్లో సమ్మె జరుగనుంది. దీని కోసం జాతీయ సంఘాలతో పాటు ప్రాంతీయ సంఘాలన్నీ సమ్మెను విజయవంతం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. సింగరేణిలో కార్మిక శక్తిని చాటడం కోసం కార్మిక సంఘాల జేఏసీలు ఏర్పడి సమ్మెను ఎలాగైనా విజయవంతం చేయాలని సంకల్పించాయి. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీతో పాటు సీఐటీయూ, ఐఎఫ్టీయూ ఇతర ప్రాంతీయ సంఘాల కూటమితో పాటు మరో జాతీయ సంఘం హెచ్ ఎంఎస్‌తో పాటు జేఏసీ నేతలు కూడా సమ్మె పిలుపులో భాగస్వామ్యమయ్యారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం వల్ల కార్మికవర్గం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోబోతుందని లేబర్ కోడ్లు రద్దయ్యేంత వరకు పోరాటం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నేతలు పేర్కొంటున్నారు.

**సమ్మెకు బీఎంఎస్ దూరం..**

నేటి దేశవ్యాప్త సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంది. ఈ సమ్మె రాజకీయ ప్రేరేపితమని, కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని జాతీయ సంఘమైన బీఎంఎస్ నేతలు పేర్కొంటున్నారు. ఈ చట్టాలతో కార్మికవర్గానికి మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. మరోవైపు సింగరేణి యాజమాన్యం సమ్మెవద్దని, కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసి కార్మికులు నష్టపోవద్దని, కంపెనీకి నష్టం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.





# కుమ్రంభీం జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

**67.17 శాతం పోలింగ్ నమోదు - ఓటుహక్కు వినియోగించుకున్న 43,754 మంది ఓటర్లు**
**ఓటర్లు ఇబ్బంది పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు - పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ హరిత**
**- జనకాపూర్ పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత - పోలింగ్ కేంద్రాల వద్ద నాయకుల హడావిడి**



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మున్సిపల్ ఎన్నిక ల్లో భాగంగా బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలోని 50 వార్డుల్లో ఎన్నికలను నిర్వహించారు. 43,754 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 67.17 శాతంగా పోలింగ్ నమోదైంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 13,927 మంది ఓటర్లు ఉండగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 2203 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగ 11 గంటల వరకు 5553, 1 గంట వరకు 8596, 3 గంటల వరకు 10,117 పోలింగ్ పూర్తయ్యే సరికి మొత్తం 10,817 మంది ఓటుహక్కు వినియోగించుకోగ ఇందులో 5333 మంది పురుషులు, 5483 మంది మహిళలు ఇతరులు ఒక్కరు ఓటు వేశారు. కాగజ్‌నగర్ మున్సిపా లిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 51,205 మంది ఓటర్లు ఉండగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 5219 మంది 11 గంటల వరకు 13,487 మంది, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 22,466 మంది, మూడు గంటల వరకు 28,620 మంది పోలింగ్ ముగిసే వరకు 32,937 మంది ఓటు వేశారు. ఇందులో 16,101 మంది పురుషులు, 16,831 మంది మహిళలు ఇతరులు ఐదుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల ను జిల్లా కలెక్టర్ కె హరిత, ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలు సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుని ఎన్నికల సిబ్బందికి దిశ నిర్ధేశం చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సహం గా పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చారు. ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరి ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నాందేడ్ తదితర దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చి ఓటు వేశారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఉదయం పూట పోలింగ్ మందకొడిగా జరిగిన ఆ తర్వాత పుంజుకుంది. పోలింగ్ కేంద్రాలకు వృద్దులను దివ్యాంగులను తరలించేందుకు సిబ్బంది వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల వీల్‌చైర్లు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆసిఫాబాద్ పోలీసు అధికారులు అంక్షలు విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందు లకు గురయ్యారు. శాంతి భద్రతల పేరుతో ప్రధాన రహదారిపై నాకాబంది ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నప్పటికిని మెడికల్ దుకాణాలను మూసి వేయించడం వాహనాలకు అనుమతించక పోవడంతో ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు అత్యుత్సహాన్ని ప్రదర్శించారు. మీడియాకు జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన పాస్‌లు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రాలకు వెళ్లే క్రమంలో అడ్డుకున్నారు. ఎన్నికల పోలింగ్‌లో బాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ నేతృత్వం లో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ వహిదుద్దీన్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.



**కాగజ్‌నగర్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు...**
కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 30 వార్డులకు 85 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ తొలి గంటల్లో ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. మధ్యాహ్నం తర్వాత మాత్రం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్త ఓటరు జాబితా ఉండడంతో పలువురు ఓటర్లు తమ పేర్లు గుర్తించటంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది ఓటర్లు పేర్లు లేక పోవటం, ఇతర వార్డుల్లో రావటంతో అంతా టెన్షన్‌కు గురయ్యారు. అయితే ఎన్నికల అధికారులు మాత్రం వివరణ ఇచ్చి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు తమ కార్యకర్తలతో కలిసి ఓటర్లకు సహకారం అందించారు. అన్ని పార్టీల నాయకులు కొంత మంది ఓటర్లను ఓటేసేందుకు ప్రత్యేక వాహనాలను సమకూర్చారు. వృద్ధులను తీసుకవచ్చి ఓటేయించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బందికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

**ఓటు ఉన్నా చనిపోయినట్టు తొలగించారు..**
కాగజ్‌నగర్ సర్‌సిల్క్‌కు చెందిన రాజమ్మ ఉప్పరి పాత ఓటరు జాబితాలో ఉంది. ఓటేసేందుకు ఉదయం సర్‌సిల్క్ శిశుమందిర్ పాఠశాలకు రావడంతో ఎన్నికల అధికారులు మీరు చనిపోయినట్టు ఓటరు జాబితాలో ఉందని చెప్పడంతో ఇంటిముఖం పట్టింది. తాను బతికి ఉండగానే చనిపోయినట్టు అధికారులు జాబితాలో ఉందని చెప్పడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

**ఓటను చింపిన ఓటరు..**
కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ రిక్షా కాలనీలో ఇమ్రాన్ అనే వ్యక్తి ఓటేసేందుకు ఉదయం పూట ఎన్నికల కేంద్రానికి వచ్చాడు. ఓటేసి డబ్బాలో వేసే సమయంలో ఒక్కసారి ఎవరికి వేసానని చూసుకొని తాను వేరే పార్టీకి ఓటేశానని తెలుసుకొని చింపేస్తుండంతో అక్కడే ఉన్న అధికారులు వారించారు. దీంతో ఒక్కసారిగా ఫిట్స్‌తో పడిపోయారు. వైద్య సిబ్బంది సకాలంలో చికిత్సలు అందించారు. ఈ విషయంలో డీఎస్పీ వహీదోద్దీన్ పూర్తి వివరాలు సేకరించారు.

**ఓటేసిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప దంపతులు..**
మున్సిపల్ ఎన్నికల్లో 1వ వార్డులో నివాసం ఉంటున్న సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సతీమణి కోనేరు రమాదేవి ఉదయం పూట ఓటేసేందుకు ఫాతిమా కాన్వెంటుకు పాఠశాలకు వచ్చారు. అలాగే వీరి కుటుంబ సభ్యులంతా కూడా ఇక్కడే ఓటు ఉండటంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓటింగ్ సరళిపై వాకాబు చేశారు.

**పోలింగ్‌పై ఎమ్మెల్సీ ఆరా..**
ఉదయం పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుండడంతో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్ని పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఆరా తీశారు. ఓటింగ్ సరళి, తదితర అంశాలు పూర్తి స్థాయిలో నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.




**పోలింగ్ కేంద్రాల వద్ద నాయకుల హడావిడి..**
పోలింగ్ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకు లు ఆయా కేంద్రాల వద్ద సందడి చేశారు. ఓటర్లను తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పోలింగ్ సరళిని పరిశీలించారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.పీ తదితరులు తమ పార్టీ అభ్యర్థుల గెలుపు అవకాశాలపై విశ్లేషణ చేపట్టారు.

**జనకాపూర్ పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత...**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ కేంద్రంలోకి గంటకు ఒకసారి పార్టీల వారీగా ఏజెంట్లను అనుమతించాలని పోలీసులు నిర్ణయించడంతో వివాదం చెలరేగింది. కాంగ్రెస్ పార్టీ

**మీడియాపై ఆంక్షలుపై అధికారుల జోక్యం..**
ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల అత్యుత్సాహం కనిపించింది. జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించకుండా గస్తీ కానిస్టేబుల్ నిరాకరించారు.
అనంతరం లింగాపూర్ ఎస్ఐ గంగన్న జోక్యం చేసుకుని అనుమతి కల్పించారు. జనకాపూర్ పోలింగ్ కేంద్రంలో కూడా గేటు వరకు మాత్రమే మీడియాకు అనుమతి ఇవ్వాలని జోనల్ అధికారి, ఆర్వో సూచించారని తిర్యాని ఎస్ఐ వెంకటేష్ అడ్డుకోవడంతో ఆర్డీవో లోకేశ్వరరావు ఫోన్ ద్వారా జోనల్ అధికారిని సంప్రదించి మీడియా ప్రతినిధులకు లోనికి అనుమతి కల్పించారు.










## ఓటీటీలో 'ధురంధర్' ప్రభంజనం..

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2నుంచి 8వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

## సినిమాలు తగ్గినా క్రేజ్ తగ్గలేదు..

చాలా మంది చైల్డ్ ఆర్టిస్ట్ ఇప్పుడు హీరోలుగా, హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది చైల్డ్ ఆర్టిస్ట్ లు హీరోలుగా హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. తేజ సజ్జ, కావ్య కళ్యాణ్ రామ్, నిత్యా శర్మ ఇలా చాలా మంది ఇప్పుడు సినిమాలతో బిజీగా ఉన్నారు.అలాంటి వారిలో తేజస్వి మదివాడ ఒకరు. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో ఫేమస్ అయిన తేజస్వి మదివాడ. ఆర్జీవీ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్ గా నటించినా, ఆ తర్వాత సెకెండ్ ఫీమేల్ లీడ్, క్యారెక్టర్ ఆర్టిస్టుగానే ఎక్కువగా కనిపించింది.బిగ్ బాస్ హౌజ్ లో అడుగు పెట్టి బుల్లితెర ఆడియెన్స్ కు చేరువైన తేజస్వి మదివాడ ప్రస్తుతం టీవీ షోలతో బిజీబిజీగా ఉంటోంది. అలాగే పలు సినిమా ఈవెంట్స్ లోనూ సందడి చేస్తోంటోంది. ఇక సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుందీ అమ్మడు.ఈ అమ్మడి గ్లామరస్ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. నిత్యం తన లేటెస్ట్ క్రేజీ ఫొటోస్, వీడియోలను షేర్ చేస్తూ ఫాలోవర్లతో టచ్ లో ఉంటోంది. అయితే ప్రస్తుతం తేజస్వి మదివాడ సినిమాల స్పీడ్ తగ్గిచింది. కొన్ని వెబ్ సిరీస్ ల్లో నటిస్తుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది. పలు టీవీ షోల్లోనూ పాల్గొంటుంది. నెట్టింట ఈ ముద్దుగుమ్మ షేర్ చేసే ఫోటోలు కుర్రాళ్ళ మతులు పోగొడుతున్నాయి. ఓ రేంజ్ లో గ్లామర్ ఒలకబోస్తూ ఫోటోలు పంచుకుంటుంది ఈ అందాల భామ.



## ఆ ఆరోపణలు అవాస్తవం

అల్లు అర్జున్ ఎంతో హుందాగా... అందరితోనూ ఎంతో గౌరవప్రదంగా మెలుగుతుంటారని, ఆయనపై ప్రచారమవుతున్న ఆరోపణలు పూర్తిగా  అవాస్తవమంటూ ఆయన బృందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. నిరాధారమైన ఆరోపణలు చేసిన వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు తీసుకొనేందుకు తమ న్యాయ బృందం ఉపక్రమించినట్టు అందులో తెలిపింది. ఇటీవల విడుదలైన ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కావేరీ బారువా అనే  ఓ బ్రాండ్ స్ట్రాటజర్ మాట్లాడుతూ అల్లు అర్జున్‌తో ప్రకటనల్ని చిత్రీకరించేటప్పుడు 42 రకాల నిబంధనల్ని పాటించాల్సి ఉంటుందంటూ వ్యాఖ్యలు చేసింది. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ వ్యాఖ్యల్ని ఖండిస్తూ అల్లు అర్జున్ బృందం ఓ ప్రకటనని విడుదల చేసింది.






# ఆదిలాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

- ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 69.04శాతానికే పరిమితమైన ఓటింగ్
- భారీగా మహిళా ఓటర్ల భాగస్వామ్యం - యువతలోనూ ఉప్పొంగిన ఉత్సాహం
- పోలీసుల భారీ బందోబస్తు - ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు











**ఆదిలాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మున్సిపల్ పరిధిలోని కొన్ని వార్డుల్లో చెదురు ముదురు ఘటనల మినహా ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయింది. మున్సిపాలిటీలోని 49 వార్డుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్ లు దగ్గరుండి పర్యవేక్షించారు. పలు సమస్యాత్మక కేంద్రాలను ఎస్పీ పలుమార్లు సందర్శిస్తూ అక్కడి పరిస్థితి పై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ ప్రక్రియ మందకోడిగానే సాగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు 57.67% పోలింగ్ నమోదయింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పలు కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరగా, మరికొన్ని కేంద్రాల్లో అడపాదడపాగా ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు మరికొన్ని చోట్ల బీజేపీ కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట జరగడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు మోడల్ పోలింగ్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే వృద్ధ ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. అటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ శాంతినగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రేమేంధర్, మాజీ చైర్పర్సన్ రంగనేని మనీషా సైతం తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. బుధవారం సాత్నాల కార్వర్ట్స్‌లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 38, పోలింగ్ స్టేషన్ నంబర్ 170 వద్ద కలెక్టర్ సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. అదేవిధంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సైతం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ని 4వ వార్డు సంబంధించిన ఓటు హక్కును ఇక్కడి నుండి వినియోగించుకున్నారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఓటు కీలకమని పేర్కొన్నారు .

**ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ రాజర్షి షా...**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక సాత్నాల క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 38, పోలింగ్ స్టేషన్ నంబర్ 170 వద్ద ఆయన సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**టీటీడీసీలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్...**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు వెబ్‌కాస్టింగ్ కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్రతో కలిసి కేంద్రంలో ఉన్న సాంకేతిక సదుపాయాలు, మానిటరింగ్ విధానాన్ని సమీక్షించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి అంతరాయాలు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ లో భద్ర పరిచి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలిసి సీల్ వేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



















# నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

- మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి
- పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్
- పోలీసుల భారీ బందోబస్తు - ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



**నిర్మల్, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బైంసా నిర్మల్ ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 80 వార్డులకు 2004 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ మధ్యాహ్నం ఊపందుకుంది. అయితే పట్టణంలో పోలింగ్ కేంద్రాల వద్ద జనం లేకపోవడంతో ఓటర్లు ఇలా వచ్చి అలా ఓట్లు వేసి సంతోషం వ్యక్తం చేశారు. ఖానాపూర్ పట్టణంలో ఓ వార్డులో కొందరు ఓటర్లు రెండుసార్లు ఓట్లు వేశారని పోలీసులపై టిఆర్ఎస్ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సమస్య ఆత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**ఎన్నికలకు ప్రతి ఒక్కరు సహకారం: కలెక్టర్**

నిర్మల్ జిల్లాలోని బైంసా ఖానాపూర్ నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రభుత్వపరంగా మౌలిక సదుపాయాలు కల్పించడం పడిందని తెలిపారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారని ఎందుకు రాజకీయ పార్టీలు కూడా సహకరించారని తెలిపారు. నిర్మల్ బైసా మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ సబ్ కలెక్టర్ సాయి సాకేత్ కుమార్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆర్డిఓ రత్న కళ్యాణి అధికారులు ఉన్నారు.

బైంసా మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుండి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సబ్ కలెక్టర్ సాయి సంకేత్ కుమార్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా సందర్శించారు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ప్రశాంతంగా ఎన్నికలు: ఎస్పీ జానకీ షర్మిల**

నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ఖానాపూర్ బైంసా మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ గట్టి పోలీసు భద్రత మధ్య ప్రశాంతంగా ముసినట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మూడు మున్సిపాలిటీలో ఆమె సందర్శిం చి శాంతి భద్రతులపై ఎప్పటికప్పుడు పోలీసులకు సూచన లు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పోలీస్ బృం దాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ




సంఘటన జరగకుండా అందర్నీ సమన్వయం చేసుకొని ఎన్నికల పోలింగ్ భద్రత పర్యవేక్షించడం జరిగిందన్నారు

**ఓట్లు వేసిన ప్రముఖులు...**

నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ఖానాపూర్ బైంసా మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రముఖులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. నిర్మల్‌లో బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీరరావు గ్రంథాలయ చైర్మన్ అరుచుమత్ అలీ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల అనురాధ అప్పల గణేష్ చక్రవర్తి బైంసాలో ఎంఐఎం అధ్యక్షులు జాబీర్ అహ్మద్ నిర్మల్ బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి యోగితా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**గెలుపు ఓటములపై ధీమా..**

నిర్మల్ బైంసా ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అధికార పగ్గాలు చేజిక్కినందుకు చివరి వరకు ప్రయత్నాలు సాధించిన పార్టీలు ఎన్నికల పోలింగ్ సల్లులో గెలుపు ఓటములపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 25 నుంచి 30 స్థానాలు వస్తాయని విశ్వాసంతో ఉండగా బిజెపి 15 నుంచి 20 ఎంఐఎం, 6 బీఆర్ఎస్ ఐదువస్తాయని అంచనా వేస్తున్నారు ఖానాపూర్లో టిఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ ఉందని రెండు పార్టీల నేతలు పేర్కొంటున్నారు. బైంసాలో ఎంఐఎం కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటుందని అంచన వేస్తుండగా బీఆర్ఎస్ కీలకంగా మారబోతున్నట్లు విశ్వాసంతో ఉన్నారు.

**డీఈవో తీరుపై ఉపాధ్యాయుల ఆగ్రహం**

నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు తక్కువ రెమినేషన్ చెల్లించడం పై ఉద్యోగులు నిరసన తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో విధులు ముగించుకొని వచ్చిన ఉద్యోగులకు పిఓ, ఏపీవో కు చెల్లించవలసిన రీమినేషన్ కంటే తక్కువ చెల్లిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈవోతో వాగ్వాదానికి దిగారు. డీఈఓ భోజన్న జోక్యం చేసుకొని నిబంధన ప్రకారం చెల్లిస్తున్నామని చెప్పిన వారు ఆయన ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతి ఎన్నికల్లో ఉన్నతాధికారులు రెమినేషన్ చెల్లింపులో ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు లక్ష్మణ్ శంకర్ అశోక్ తదితరులు ఆరోపించారు.

**ఖానాపూర్ మున్సిపాలిటీలో ప్రశాంతంగా..**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ , బస్టాండ్ స్కూల్, గాంధీనగర్ ,వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారులు వికలాంగులకు, వృద్ధులకు, వీల్ చైర్ అవకాశం కల్పించారు. పోలీసులు సిఐ అజయ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే ,డిసిసి అధ్యక్షులు వెడుమ బొజ్జు పటేల్, బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్, బిజెపి జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్లు సమీక్షించారు.

**పకడ్బందీగా ఓట్ల లెక్కింపు...**

ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ









పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల్, భైంసా, ఖానా పూర్ మున్సిపాలిటీల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుల్స్, అభ్యర్థుల గ్యాలరీలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలుకీలక సూచనలు చేశారు.

















# మంచిర్యాల జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

- ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్లు, రామగుండం సీపీ, ఎస్పీలు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం - కౌంటింగ్ కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు





**మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లోని 60 డివిజన్లకు, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సి పాలిటీల పరిధిలోని 89 వార్డులకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఐదు గంటలలోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లకు ఓటు హక్కును వినియోగించుకునే అవకా శాన్ని కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ఓటింగ్ సరళిని పర్య వేక్షించిన అనంతరం బెల్లంపల్లిలోని మండల పరిషత్ ప్రాథ మికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠ శాల, క్యాతనపల్లి రామకృష్ణాపూర్‌లోని ఆల్ఫోన్సా పాఠశా లల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్‌తో కలిసి మంచిర్యాలలోని ఆర్‌బీహెచ్‌వీ, క్రిస్ట్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

**గట్టి పోలీసు బందోబస్తు...**
మంచిర్యాల జిల్లా పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లో 60 డివిజన్లు, క్యాతన్పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల పరిధిలోని 89 వార్డుల పరిధి లోని 128 పోలింగ్ లొకేషన్లలోని 444 పోలింగ్ కేంద్రాల వద్ద బుధ వారం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిం చారు. ముందుగానే గుర్తించిన 179 సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాతోపాటు ఎప్పటికప్పుడు స్పెషల్ టీంతో పెట్రోలింగ్ జరిపారు. జిల్లాలోని కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల్లో పోలింగ్ శాతం నెమ్మదిగా ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లాలో పోలింగ్ 68.60 శాతం జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 2,94,297 (పురుషులు 1,45,403, మహిళలు 1,48,867, ఇతరులు 27) మంది ఓటర్లుండగా పోలింగ్ ముగిసేసమయానికి 2,01,875 ( పురుషులు 99,759, మహిళలు 1,02,110, ఇతరులు 6) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ : కలెక్టర్ కుమార్ దీపక్**
2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల అల్ఫోన్జా ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ క్రమంలో అర్హులైన ఓటర్లు నిర్ణీత సమయంలోగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటు మూసివేసి, లోపల ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవసరమైన తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల బందోబస్తును పర్యవేక్షించిన సీపీ...**
జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్, బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో జరిగిన డివిజన్, వార్డు కౌన్సిలర్ ఎన్నికల బందోబస్తును రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తో కలిసి పరిశీలించారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్బీహెచ్వీ, క్రిస్ట్ పాఠశాలల్లోని పోలింగ్ కేం ద్రాలను సందర్శించి ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతాచర్యలు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలను పరిశీలించారు. ఓటర్లతో కూడా మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ సిబ్బంది సహాయపడ్డారా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎస్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తదితరులున్నారు.

















